కొసమెరుపు కథ

# తహ.... తహ....

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ దగ్గర లూనా ఆగిన శబ్దం వింటూనే ఏదో ప్రళయం వచ్చినంతగా హడావుడి పడిపోతూ తన రూమ్ నుండి పరుగెత్తుకొచ్చింది సుందరి. లూనా గేటు దాటించి పొగడ చెట్టు క్రింద పార్క్ చేస్తోంది సునీత. "వచ్చేశావా సునీ! నీకోసం ఎప్పట్నుంచి ఎదురుచూస్తున్నానో తెల్సా!" అంటూ ఆతృతగా సునీత భుజం పట్టుకుని ఊపేసింది సుందరి. ఇతరుల విషయాల్లో సుందరికున్న క్యూరియాసిటీ ఎలాంటిదో సునీతకు తెలుసు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉన్న అందరి జీవిత చరిత్రల విషయంలో సుందరిది కంప్యూటర్ బ్రెయిన్!

"ఏం - ఏమైంది?" అంది సునీత తీరిగ్గా.

"అహఁ... ఏం కాలేదులే! కాబోతోంది - అంతే.. అదే... నీ పెళ్ళి!" ముసి ముసి నవ్వుల్ని ముఖంలో దాచుకుంటూ అంది సుందరి.

"చూడు సుందూ... ఆ చెప్పేదేదో డైరెక్ట్‌గా చెప్పి ఏడు. అవతల నాకు పనుంది" అంది సునీత కాస్త విసుగ్గా.

"అదివారం... అదీ సాయంత్రం అయిదింటికి... ఏంటమ్మా అంత అర్జంటు పనీ?"

"మా ఆఫీసరు కొడుకు బర్త్‌డే ఈరోజు. ఆరింటికి వాళ్ళింట్లో ఉండాలి. కాస్త డెకరేషన్ పనీ అదీ చూడాలి..."

"అవునూ... నాలుగింటికి ఎక్కడి కెళ్ళావు?"

"ఓ స్నేహితురాలింటికి గానీ... ఇంతకీ ఏమిటీ విషయం? అసలు సంగతి చెప్పకుండా నానుస్తావేం?" అంది సునీత విసుగ్గా.

"నీకోసం ఓ విజిటర్ వచ్చాడివాళ. సరిగ్గా నాలు గింటికి. పాపం... అరగంట వెయిట్ చేశాడు. అయిదింటి ట్రెయిన్ కాచ్ చేయాలని హడావుడిగా స్టేషన్‌కి పరుగెత్తాడు. మీ అన్నయ్య పంపాడట అతడ్ని. పేరు రమేష్... రా... అలా ఆ చెట్టు క్రింద కూర్చుందాం... తీరిగ్గా చెప్తా..." అంటూ సునీత చెయ్యి పట్టుకుని సిమెంటు బెంచీవేపు దారితీసింది సుందరి.

విషయం వెంటనే అర్థం అయిపోయింది సునీతకి. నవ్వొచ్చింది. ఎవరో ఎలిజిబుల్ బాచ్‌లర్ కాబోలు! అనుకుంది మనసులో, దూరంగా కన్పిస్తున్న బంతి పూలని చూస్తూ.

"భలే డాషింగ్‌గా, హాండ్‌సమ్‌గా ఉన్నాడే అతను. వాళ్ళ ఊరు రాజమండ్రి అట. వాళ్ళ నాన్నకు ఇరవై ఎకరాల చెరకు తోట వుందట. ఇతనికి ముగ్గురు అన్నలు, ఇద్దరు అక్కలు ఉన్నారట. ఇద్దరు అక్కల పెళ్ళిళ్ళు అయిపోయాయట. పెద్దక్కని ఇంజనీరు కిచ్చారుట. వాళ్ళు అమెరికాలో వుంటారట. పెద్దక్కకి ఇద్దరు మగపిల్లలట. రెండో అక్కకి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి అట. ఇక అతని పెద్దన్నేమో ఊళ్ళోనే బెల్లం వ్యాపారం చేస్తున్నాడట. రెండో అన్నేమో మిలటరీ ఆఫీసరుట. జైపూర్‌లో ఉన్నాడట. మూడో అన్నేమో ఇంజనీరు, మద్రాసులో. ఈమధ్యే పెళ్ళయింది. ఇక రమేష్ ఆంధ్రా యూనివర్శిటీలో ఎం.ఎస్సీ. ఫిజిక్స్. ఈ మధ్యే పి.హెచ్‌డి.కి పేపర్స్ సబ్‌మిట్ చేశాడట. హైదరాబాదులో ఏదో ఇన్స్టిట్యూట్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడట. త్వరలో ప్రమోషన్ వస్తుందట. జీతం నెలకు ఏడు వేలు... ఫ్రీ క్వార్టర్స్ అట. పనిమనిషే వంట చేసి పెడ్తుందట. జీతం నెలకు రెండొందలు. ఆవిడ భర్త రమేష్ వాళ్ళ ఆఫీసులో వాచ్‌మేన్ అట..." చెప్పుకుంటూ పోతోంది సుందరి ఎక్స్‌ప్రెస్ స్పీడులో, చుట్టూ ప్రపంచాన్నే మర్చిపోయి.

"మరి అతని అన్నలకి ఎందరు పిల్లలు?" వస్తున్న నవ్వు ఆపుకుంటూ అడిగింది సునీత.

"అఁ... మర్చేపోయా చెప్పడం... పెద్దన్నకి ఇద్దరు కూతుళ్ళట. ఒక అమ్మాయి టెన్తు, ఇంకో అమ్మాయి ఫిఫ్తు. రెండో అన్నకి ఒక కొడుకట. పదేళ్ళవాడు. ఒక్కడే చాలు అని సరిపెట్టుకున్నారుట. అవున్లే - ఈ రోజుల్లో అంతకు మించి పోషించాలన్నా కష్టంగానే వుంది. మూడో అన్న భార్య గర్భిణి అట. రెండో నెల. మూడో నెలలో పుట్టింటికి వెళ్తుందట. వాళ్ళ ఊరు విజయవాడ అట..."

"ఊఁ... ఇంకా ఏం చెప్పాడు?"

"రమేష్ మీ అన్నయ్యని మీట్ అయ్యాడట. మీ అన్నయ్యేమో ముందు వెళ్ళి మా చెల్లెల్ని చూసుకోండీ, తరువాత మాట్లాడుకుందాం మిగతా విషయాలన్నీ అన్నాడట. ఇతను మళ్ళీ వచ్చే ఆదివారం వస్తానన్నాడు నాలుగింటికి. నిన్ను తప్పక ఉండమన్నాడు.." అంది సుందరి ఎంతో ఉత్సుకతతో.

ఎందుకో చిరాకన్పించింది సునీతకు. ఈ మనిషికి ఇంత క్యూరియాసిటీ ఏమిటి? ఆ మనిషి తన జీవిత చరిత్ర మొత్తం పూసగుచ్చినట్లు ఈవిడకి చెప్పడం ఏమిటి? ఇద్దరూ ఇద్దరే... అనుకుంది వళ్ళు మండుతూంటే.

"ఓ పని చేస్తావా సుందూ?" అంది సుందరి ముఖంలోకి చూస్తూ.

"ఓ" అంటూ తలాడించింది సుందరి.

"ఆ రమేష్‌ని నువ్వే చేసేసుకో. పాపం.. ఇంత శ్రమపడి అతని జీవిత చరిత్ర అంతా సేకరించావ్‌గా!!" అంటూ నవ్వేసి తీరిగ్గా లూనా స్టార్ట్ చేసింది సునీత, తెల్లబోయి చూస్తున్న సుందరిని సిమెంట్ బెంచీపై వదిలేసి.

- ఎమ్. నాగమణి

